క్లుప్తంగా...

కట్టా శేఖర్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సంస్కృతం విభాగం విద్యార్థి కట్టా శేఖర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ ముక్తావాణి పర్యవేక్షణలో కాళీదాసు కృతిషు లలిత కళాహ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ నాయకునిగా కీలక పాత్ర పోషించిన శేఖర్‌కు డాక్టరేట్ లభించడం పట్ల ప్రశంసలు అందుకుంటున్నాడు.

బతుకమ్మ సంబురం



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్తీకరెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కాలనీ, బస్తీ కూడళ్లలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ సందడి చేశారు. సత్యానగర్ కాలనీ జై భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేసిన వెన్నెల

కంటోన్మెంట్: ప్రజాగాయకుడు దివంగత గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెల ఆదివారం తాడ్‌బంద్ వీరాంజనేయ స్వామి, పికెట్ సంతోషిమాత ఆలయాలను దర్శించుకున్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె ఖరారైనట్లు ప్రచారం సాగుతుండగా, ఆదివారం ఆమె నియోజకవర్గ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని తాను ఆలయాల సందర్శనకు వచ్చానని వెన్నెల పేర్కొన్నారు. ఆమె వెంట బాలరాజు యాదవ్, బంగారు సదా, పవిత్ర, సందీప్, హైదర్, టిల్లూ, లడ్డూ ఉన్నారు.

హమాల్‌బస్తీలో బొడ్రాయి పూజ



పూజల్లో పాల్గొన్న సాయికిరణ్ యాదవ్, పవన్‌కుమార్ గౌడ్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ ప్రారంభ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జి. పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ నెల 25న హమాల్‌బస్తీలో బొడ్రాయిని ప్రతిష్ఠించనున్నట్లు బస్తీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశన్, మహేష్, బస్తీ అధ్యక్షులు సుభాష్, యాదగిరి, సత్యనారాయణ, అంజయ్య, నర్సింగ్, వెంకటేష్, కుషాల్ పాల్గొన్నారు.

'డబుల్ ఇంజిన్' సర్కారుతోనే అభివృద్ధి



ప్రచారంలో పాల్గొన్న సుష్మిత శంకర్రావు

కంటోన్మెంట్: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకురాలు సుష్మిత శంకర్రావు అన్నారు. కంటోన్మెంట్ ఏడో వార్డు, వంగపల్లి గార్డెన్స్, శ్రీనగర్ కాలనీ, మూడో వార్డు అన్నానగర్ అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటికీ బొట్టు కార్యక్రమం పేరిట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రంలో ఒకటే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. ముఖ్యంగా రక్షణ శాఖ పరిధిలో ఉండే కంటోన్మెంట్ ప్రాంతంలో కేంద్రం పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ కనకరాజు, భాగ్యమ్మ, దయానంద్, అనురాధ, భువనేశ్వరి, ఓంప్రకాశ్, వెంకటేశ్, మల్లేష్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ కాంగ్రెస్ బరిలో కోట నీలిమా



జంగ్ 2023 తెలంగాణ

సనత్‌నగర్: నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కోట నీలిమా పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఆదివారం విడుదల చేసిన మొదటి జాబితాలో ఆమె పేరు ఉండడం గమనార్హం. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున ఆమెతో పాటు సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, మర్రి ఆదిత్యారెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేయగా చివరకు కోట నీలిమాకే పార్టీ నాయకత్వం మొగ్గు చూపింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆమె భర్త పవన్ ఖేరా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. కోట నీలిమా రచయితగా, రాజకీయ విశ్లేషకురాలు, పాత్రికేయురాలిగా, సామాజిక కార్యకర్తగా బాధ్యతలు నిర్వర్తించారు. గత 20 ఏళ్లుగా తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో సామాజిక, ఆర్థిక, వ్యవసాయ సంబంధిత విషయాలు, సమస్యలు, పరిష్కారాలపై అనేక పరిశోధనలు చేశారు.

పేరు: కోట నీలిమా

వయస్సు: 52
విద్యార్హత: పీహెచ్‌డీ
వృత్తి: రచయిత్రి, పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త
కుటుంబ నేపథ్యం: భర్త పవన్ ఖరే (ఏఐసీసీ మీడియా వింగ్ ఇన్‌ఛార్జి)
రాజకీయ నేపథ్యం: కేవీ రామశర్మ కాంగ్రెస్ పత్రికలు అయిన కాంగ్రెస్ సందేశ్, నేషనల్ హెరాయిల్డ్‌కు సంపాదకులుగా పనిచేశారు. ఆయన ప్రభావంతో కాంగ్రెస్‌పై ఆమెకు ప్రత్యేక అభిమానం ఏర్పడింది. ఏఐసీసీ సభ్యురాలిగా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.
నివాసం: వాసవీ ఇంద్రప్రస్థా, రోడ్డునెంబర్–1, జెక్‌కాలనీ సనత్‌నగర్.

లష్కర్‌లో మొదటిసారి స్థానికుడికి టికెట్



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ చరిత్రలో మొదటిసారి స్థానికుడికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టింది. ఇక్కడ దశాబ్దాల తరబడి పార్టీలో పనిచేస్తున్న నాయకులు, ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అన్నివిధాల అర్హతలు కలిగిన నాయకులు ఉన్నప్పటికీ గడచిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు మాత్రం బయటి నుంచే నాయకులను ఎంపిక చేసేవారు. ఈ కారణంగా మాజీ మేయర్ బండా కార్తీకారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ వంటి పలువురు కాంగ్రెస్ నాయకులు పార్టీని వీడారు. ఈసారి మాత్రం స్థానిక నాయకుడు ఆదం సంతోష్ కుమార్‌కు అభ్యర్థిత్వం దక్కింది. 1995 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గౌరీశంకర్, 1989, 2004లో మేరీ రవీంద్రనాథ్, 2008 ఉప ఎన్నికలో పిట్ల కృష్ణ, 2009, 2014లో సినీనటి జయసుధ, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసాని జ్ఞానేశ్వర్ వంటి నేతలు అందరూ ఈ నియోజకవర్గానికి సంబంధం లేనివారు కావడం గమనార్హం. ఈ సారి మాత్రం స్థానిక కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి పీసీసీ అధిష్ఠానం కొత్త చరిత్రకు తెరలేపింది.

పేరు: ఆదం సంతోష్‌కుమార్

వయసు: 54
విద్యార్హత: బీకాం పట్టభద్రుడు
వృత్తి: రాజకీయం
ప్రవృత్తి: వ్యాపారం
అనుభవం: యువజన కాంగ్రెస్ మొదలు 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం. రైల్వే ఉద్యోగిగా చేరి ముందస్తు పదవీ విరమణ తీసుకున్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వరకు వివిధ హోదాల్లో పనిచేశారు.
కుటుంబం: భార్య ఆదం ఉమాదేవి రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోటీచేసి కార్పొరేటర్‌గా గెలుపొందారు. కుమారుడు ఆదం సృజన్ ప్రస్తుతం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

వైఎస్సార్‌టీపీ వైపు ఓయూ విద్యార్థి జేఏసీ నేతల చూపు!

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు వైఎస్సార్ టీపీ వైపు చూస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్, బీజేపీలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థి నేతలకు అవకాశం దక్కదని తెలుసుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో సీనియర్లు, వారి వారసులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన కొత్త వారికి ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు చోటు దక్కడం ప్రశ్నార్థకమే.

కనీసం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ స్థానాలలో సైతం ఓయూ నేతలకు అవకాశం దక్కేలా లేదు. అందుకోసం వైఎస్సార్‌టీపీలో చేరేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న డాక్టర్.సత్యవతి, పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షుడు గౌతం ప్రసాద్, నాగరాజు, శోభ, ఆదాం, మరికొందరు వివిధ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇదే బాటలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలో టిక్కెట్ లభించని నాయకులు వైఎస్సార్‌టీపీలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

అభివృద్ధి చేశా మళ్లీ ఆదరించండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ రూ. కోట్లతో అభివృద్ధి చేశానని మరోసారి తనను ఆదరించాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఆదివారం పీజీ రోడ్డులో అపార్ట్‌మెంట్ వాసుల ఆహ్వానం మేరకు వెళ్లి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పీజీరోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని, రోడ్లు కూడా గుంతలమయంగా ఉండేవని రూ.20 కోట్లతో తాను రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కరించానని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసే వారికి అవకాశం ఇస్తే అభివృద్ధి అలాగే కొనసాగుతుందని గతంలో ఉన్న పాలకుల నిర్లక్ష్యంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవని అన్నారు. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ తొమ్మిదిన్నర ఏళ్లలో చేశానని సమస్యలు నిరంతరం వస్తూనే ఉంటాయని వాటిని తాను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ అగర్వాల్, శరత్ మంజని, వినయ్, ప్రవీణ్, గోపాల్, ధరమ్‌పాల్ అగర్వాల్, రోచా, మీనా చౌదరి పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

సనత్‌నగర్: నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి కోట నీలిమా అన్నారు. తనను ఆదివారం ఆమె గాంధీభవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాంపల్లి దర్గా, బన్సీలాల్‌పేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలిమా మాట్లాడుతూ.. సనత్‌నగర్ ప్రజల మద్దతు తనకే ఉందని ప్రకటించారు. సనత్‌నగర్‌ను ఎంతో అభివృద్ధి చేశామని చెబుతున్న స్థానిక ఎమ్మెల్యే ఎంతమందికి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టి ప్రజలను మభ్యపెట్టలేరన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కోట నీలిమా

లష్కర్‌లో విజయం సాధిస్తాం



మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

సికిందాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి భారీ విజయం సాధిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 35 ఏళ్లుగా వివిధ హోదాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రగతి కోసం కృషి చేశానన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇక్కడి నుంచి మూడుమార్లు గెలిచిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ అందిస్తామని చెప్పి గెలిచిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ విస్మరించారన్నారు. అభివృద్ధి పనులు చేపట్టామని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని, లష్కర్ నిండా సమస్యలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సృజన్, పలు డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



అంకురార్పణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న వేద పండితులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక 46వ బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ అంకురార్పణ, ధ్వజారోహణం, దేవతాహ్వానం అర్చన, హోమం, సహస్రనామార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. సంతానంలేని సుమారు 20 మంది దంపతులకు గరుడ ప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. పూజల్లో ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సృజయ్, వెంకటరమణ, రామచందర్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

అత్యుత్తమ బోధనకు చిరునామా మెడ్జ్



సెంటర్ ప్రారంభోత్సవంలో అల్లం నారాయణ

రాంగోపాల్‌పేట్: జాతీయ స్థాయిలో జరిగే ఐఐటీ, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మెడ్జ్ సంస్థ అత్యుత్తమ బోధనతో ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దుతుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని రాయల్ రివ్ హోటల్‌లో జరిగిన మెడ్జ్ కోచింగ్ సెంటర్ల ప్రారంభోత్సవ ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గత కొద్ది ఏళ్లుగా ఈ సంస్థ శిక్షణ అందిస్తూ ఎంతో మందిని ప్రఖ్యాత సంస్థల్లో విద్యనభ్యసించే అవకాశాలు కల్పించి ఇప్పుడు తెలంగాణాలో అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ సీఎస్ శంకర్ మాట్లాడుతూ.. గతంలో కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో 40 శాఖలు ఉండగా నగరంలో ప్రస్తుతం 6 కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన బీఆర్ఎస్ మేనిఫెస్టో

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర అవతరణ అనంతరం రెండుసార్లు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ మూడో సారీ జరిగే ఎన్నికల కోసం సీఎం కేసీఆర్ ఆదివారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రస్తుతం పథకాలను కొనసాగించడంతో పాటు కొన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టినా రాష్ట్రంలో ఆత్మహత్యల స్థాయికి పెరిగిన నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం మేనిఫెస్టోలో ప్రస్తావించకపోవడం బాధాకరమని ఓయూ విద్యార్థి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యూనివర్సిటీల అభివృద్ధి, అధ్యాపకుల ఖాళీల నియామకాల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. విద్యావంతులైన నిరుద్యోగుల ఇబ్బందులు తెలిసి కూడా వారిని పట్టించుకోకుండా మేనిఫెస్టోను రూపొందించడం బీఆర్ఎస్ పార్టీ ఓటమికి తొలిమెట్టుగా ఓయూ విద్యార్థి, నిరుద్యోగులు పేర్కొన్నారు.

ఓట్లు వేయరని నిరుద్యోగులను విస్మరించారు



రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పదేళ్లు పరిపాలించిన సీఎం కేసీఆర్ పోలీసు ఉద్యోగాలు మినహా ఇతర ఉద్యోగాలు భర్తీ చేయలేదు. నిరుద్యోగులు, విద్యార్థులు బీఆర్ఎస్‌కు ఓటు వేయరని తెలిసి మేనిఫెస్టోలో ఉద్యోగాల గురించి ప్రస్తావించలేదన్నారు. కనీసం గతంలో ప్రకటించిన నిరుద్యోగ భృతిపై కూడా మర్చిపోవడం బాధాకరం.

– తల్లమల్ల శ్వేత–ఓయూ

ఓటుతోనే సమాధానం చెబుతాం



ఓటర్లను లక్ష్యంగా సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ మేనిఫెస్టో నిరుద్యోగులను నిరాశ పరిచింది. బీఆర్ఎస్ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నా...ప్రతి ఇంట్లో నిరుద్యోగులు ఉన్నారనే విషయాన్ని సీఎం కేసీఆర్ మరిచిపోయారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి పై మ్యానిఫెస్టోలో ప్రస్తవించనందున వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రచారం చేస్తాం.

– అబ్బాస్,–నిరుద్యోగి

దైనందిన జీవితంలో యోగా ఓ భాగం

సనత్‌నగర్: దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకుని ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త పడాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కేఎల్ఎన్‌వై పార్కు యోగా సాధన కేంద్రం 19వ వార్షిక వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతామన్నారు. కరోనా తర్వాత ప్రతిఒక్కరిలో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెరిగిందన్నారు. యోగా సాధన కోసం వచ్చేవారికి కావాల్సిన షెడ్డు నిర్మాణం, ఇతర సౌకర్యాలు కల్పించడం పట్ల నిర్వాహకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని సంక్షేమ కార్యక్రమాల అమలులో కూడా దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. కేఎల్ఎన్ పార్కులో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, యోగా గురువు కృష్ణ, నరేంద్రబంధు, కిరణ్, నిరంజన్, రవికుమార్, కుసుమ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

సనత్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జుట్టు భాస్కర్ కథనం ప్రకారం.. బేగంపేట పాటిగడ్డ సమీపంలోని వికార్‌నగర్ కట్టెలమండి ప్రాంతంలో ఆరిఫాబేగం (70) నివాసముంటుంది. ఆమె భర్త షేక్ హమీద్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి మృతి చెందడంతో ఆయన పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. ఆమె బంధువులు, మనుమలు, మనుమరాళ్లు తానుండే ఇంటికి సమీపంలోనే ఉంటుండడంతో తరచూ వారి వద్దకు వెళ్తుండేది. ఈ నెల 13న మనుమడు మోసిన్‌ఖాన్ ఇంటికి వెళ్లిన ఆమె రాత్రి 10.30 గంటలకు తిరిగి తాను ఉంటున్న ఇంటికి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా 14న తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆరిఫాబేగం తన ఇంట్లో కిందపడిపోయి ఉండటూ మోసిన్‌ఖాన్‌కు ఆమె మరో మనుమడు షేక్‌సాబేర్ ఫోన్ చేసి తెలిపాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఆమె అపస్మారక స్థితిలో కిందపడిపోయి ఉంది. ఆమె ముక్కు నుంచి రక్తం కారడంతో పాటు ఆమె చేతి వేళ్లలో కొన్ని వెంట్రుకలు కనిపించాయి. వెంటనే సమీపంలోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ఆమె అప్పటికే మృతి చెంది ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఆరిఫాబేగం కిందపడినట్లు సమాచారం అందించిన మనుమడు షేక్‌సాబేర్ చెప్పే మాటల్లో కంగారుతో పాటు పొంతన లేకపోవడంతో గట్టిగా అడిగారు. తెల్లవారుజామున ఆరిఫాబేగం ఇంటికి వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని సాబేర్‌ను ప్రశ్నించగా భయంతో అక్కడి నుంచి పరారయ్యాడు. మోసిన్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే సాబేర్,ఆస్తి కోసం, ఆరిఫాబేగంకు వచ్చే పింఛన్ కోసం ఆమెతో తరచూ గొడవ పడేవాడని పోలీసులు తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కంటోన్మెంట్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటనతో ఆ పార్టీలో జోష్ నెలకొంది. నియోజకవర్గ అభ్యర్థి లాస్యనందిత ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కార్ఖానాలో సంబురాలు నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ అద్భుతమైన ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారని లాస్యనందిత తెలిపారు. మేనిఫెస్టో ప్రకటనతో ఇక గులాబీ పార్టీకి ఏకపక్ష విజయం ఖాయమని తేలిపోయిందన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో కంటోన్మెంట్ గడ్డపై భారీ మెజార్టీతో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దివంగత సాయన్న బాటలో ప్రజాసేవలో ముందుకు సాగడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. లాస్యనందిత ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సంబురాల్లో జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, నివేదిత, టీఎన్ శ్రీనివాస్, నర్సింహ్మ ముదిరాజ్, పనస సంతోష్, కుమార్ ముదిరాజ్, వినోద్ కుమార్, కిరణ్ కుమార్, పెంట శ్రీహరి, తేజ్ పాల్ పాల్గొన్నారు.

అన్నానగర్ చౌరస్తాలో..

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారని బీఆర్ఎస్ యువజన నాయకుడు బి. సాయికిరణ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మేనిఫెస్టో ప్రకటించడంతో ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్ చౌరస్తా తెలుగు తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కనకయ్య. పరశురాం, ఎల్లేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పార్టీ నాయకులు కార్యకర్తలు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ విడుదల చేసిన మేనిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజల ప్రగతికి దిక్సూచిలా ఉందన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోని రావడం ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఇప్పటికన్నా రెట్టింపు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాకీర్, రాజేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకు ముందు అభిషేకాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన, అంకురార్పన నిర్వహించారు. ఈవో గుత్త మనోహర్‌రెడ్డి, సురిటి రామేశ్వర్, భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో..

లాలాపేట: తార్నాక, లాలాపేట తదితర ప్రాంతాల్లో అమ్మవార్లను ప్రతిష్ఠించారు. లాలాపేట గడి స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని కిషన్ శర్మ, మల్లికార్జున్, బాలియాదవ్, గోపాల్‌చారి, బాబా అశోక్ దర్శించుకున్నారు.

వెల్లివిరుస్తోన్న ఆధ్యాత్మికత..

సనత్‌నగర్: సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రుల శోభను సంతరించుకున్నాయి. మొదటి రోజు శ్రీబాలత్రిపుర సుందరీదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు.


రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం బాలత్రిపుర సుందరీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

బీదలబస్తీలో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో దేవీనవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరి అవతారంలో అలంకరణ చేసి భక్తుల దర్శనం కోసం ఉంచారు. వేడుకల సందర్భంగా అంకురార్పణ, అఖండ దీపారాధన, అవకురార్పణ గణపతి హోమం, కలశస్థాపన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ. 12 కోట్లు ఖర్చుచేశారు.. నెలకే ఆర్పేశారు!

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనానికి ఏర్పాటు చేసిన లేజర్ షో మూడు రోజుల ముచ్చటగా మారింది. గత నెల 17న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించిన లేజర్ షో లైటింగ్స్ పని చేయడం లేదు. రూ.12 కోట్ల నిధులతో లేజర్ షో మ్యూజికల్ వాటర్ పాండ్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో పర్యాటకులను కనువిందు చేసిన లేజర్ షో ఆ తర్వాత పని చేయకపోవడంతో నిరుత్సాహపడుతున్నారు.



నాడు



నేడు